క్లుప్తంగా

శాస్త్రోక్తంగా రథసప్తమి వేడుకలు



సూర్య నమస్కారాలు చేస్తున్న ఈవో శిరీష, ధర్మకర్తల మండలి సభ్యులు

డాబాగార్డెన్స్ : రథసప్తమిని పురస్కరించుకుని కనకమహాలక్ష్మి ఆలయంలో శనివారం శాస్త్రోక్తంగా వేడుకలు నిర్వహించారు. సూర్య రథ పద్మంపై ఆవు పిడకల అగ్నిహోత్రంపై ఆవు పాలు పొంగించి, సూర్యనారాయణ స్వామికి పూజలు జరిపించారు. అనంతరం క్షీరాన్నం నివేదించారు. ఆ ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, బి. వెంకటరత్నం, అనురాధ, సుబ్రహ్మణ్యం, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నార్తులకు భోజనం అందజేత



అన్నార్తులకు భోజనం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: ఆకలితో అలమటిస్తున్న అన్నార్తులకు బ్రిక్‌వాల్ డెవలపర్స్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం భోజనం అందజేసింది. ఈ సందర్భంగా సంస్థ సీఈవో ఏనుగంటి ధనరాజ్, మేనేజింగ్ డైరెక్టర్ గసాడా జెన్నిఫర్ మాట్లాడుతూ సంస్థ ఏర్పడిన నాటి నుంచి పలు సేవా కార్యక్రమాలు ప్రతి వారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌వీవీ రాజు, ఎస్. గిరీష్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

చేయూతకు 109 దరఖాస్తులు



జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: ప్రభుత్వం అందిస్తున్న చేయూత పథకానికి 109 దరఖాస్తులు ఎంపిక చేసినట్లు జోన్-4 కమిషనర్ కె.శివప్రసాద్ శనివారం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన చేయూతను జీవీఎంసీ జోన్-4 పరిధిలో గతంలో 12 వార్డులకు 992 మంది అర్హులకు అందజేశామన్నారు. ఈఏడాది కొత్తగా టైలర్లు, రజకులు, బార్బర్లు చేసుకున్న దరఖాస్తుల్లో అర్హులైన 109 మంది దరఖాస్తులను ఎంపిక చేసినట్లు జెడ్సీ తెలిపారు. దీంతో మొత్తం 1101 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారని జెడ్సీ శివప్రసాద్ తెలిపారు.

జంతు సంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు జంతు సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పూర్ణిమ

మద్దిలపాలెం: జంతు సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పశుసంవర్థక శాఖ ఇసుకతోట వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ పి.పూర్ణిమ అన్నారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం హెచ్‌బీ కాలనీ జీవీఎంసీ స్కూల్‌లో విద్యార్థులకు జంతు సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంతువులను తోటి ప్రాణులుగా పరిగణించాలన్నారు. వాటిని కొట్టడం, హింసించడం చేయరాదన్నారు. కార్యక్రమంలో జేవీవో శశికళ, హెచ్‌ఎం రాంప్రసాద్, శారద పాల్గొన్నారు.

ప్రత్యక్ష దైవానికి ప్రణమామ్యహం

• వైభవంగా రథసప్తమి వేడుకలు





విశేష అలంకరణలో శ్రీ సూర్యనారాయణస్వామి, స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి వున్న భక్తులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట అలిమేలు మంగమ్మ ఆలయంలోని శ్రీ సూర్యనారాయణస్వామి దేవాలయంలో శనివారం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త యల్లపు హరికృష్ణ, యల్లపు హేమంత్ పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు పానంగిపల్లి రంగనాథాచార్యులు, పానంగిపల్లి కేశవాచార్యులు శ్రీ వైఖానస ఆగమ సాంప్రదాయం ప్రకారం ఉషాఛాయా పద్మినీ సమేత శ్రీ సూర్యనారాయణ స్వామికి తెల్లవారు జామున పంచామృతాభిషేకాలు, విశేష అర్చనల అనంతరం స్వామివారిని మందార, గులాబీ, చామంతి వంటి పూలతో విశేషంగా అలంకరించారు. అనంతరం స్వామివారికి బెల్లం, గోక్షీరంతో తయారు చేసిన పరమాన్నం నివేదన చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని ధ్వజస్తంభం దరి నుంచే దర్శనం చేసుకుని తరించారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు అల్లిపురం పరిసర ప్రాంతాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అదే విధంగా జిల్లాలోని అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట ప్రాంతాల నుంచి భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ అర్చకులు రంగనాథాచార్యులు మాట్లాడుతూ సూర్యనారాయణ స్వామిని ప్రార్థించడం వల్ల సమస్త రోగాలు నశించి సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీన భీష్మ ఏకాదశి సందర్భంగా ఆ రోజు సాయంత్రం అమ్మవారి దేవాలయంలో శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకుడు పాణంగిపల్లి రంగనాథాచార్యులు తెలిపారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని తరించాలని ఆయన కోరారు.

శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో..

టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో గల సూర్యనారాయణమూర్తి దేవాలయంలో స్వామికి ఆలయ అర్చకుడు భార్గవశర్మ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.

బెల్లం గణపతి ఆలయంలో..

రెల్లివీధి దరి బెల్లం గణపతి ఆలయంలో వెలిసిన సూర్యనారాయణమూర్తికి ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాల అనంతరం స్వామిని విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు ఆదిత్యుని దర్శించుకునేందుకు బారులు తీరారు.

వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు స్వామివారికి విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పుష్పమాలికలు, తులసి మాలలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజ నిర్వహించారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద విశేష పూజలు నిర్వహించారు. ఫిబ్రవరి 1వ తేదీన భీష్మ ఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

గడప గడపలోనూ ఆదరణే



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: పేద, సాదతో పాటు అన్ని వర్గాల వారికి అండగా ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మనమంతా అండగా ఉండాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు.

31వ వార్డులో ఆ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్‌తో కలిసి ఆయన శనివారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన మూడున్నరేళ్లలో అందించిన పథకాలు, రానున్న కాలంలో అందించనున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం చేకూర్చిన ప్రయోజనాన్ని లబ్ధిదారులకు తెలియజేశారు. వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్‌జైన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులందరికీ అందించే బాధ్యత అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లదేనని ఎమ్మెల్యే వాసుపల్లి అన్నారు. 31వ వార్డు గొల్లలపాలెం సచివాలయ పరిధిలో గల గొల్లలపాలెం, సూర్యాబాగ్ జోనల్ కార్యాలయం, దసపల్లా హోటల్ వెనుక ప్రాంతం వద్ద గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ప్రభుత్వం, మీకు అండగా నిలిచే జగనన్న ప్రభుత్వం, మీకు ఈ మూడున్నరేళ్లలో కలిగిన లబ్ధిని ఒక్కసారి గుర్తు చేస్తున్నాం. మీ పెద్ద మనసుతో మీ బిడ్డ, మీ అన్న వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండని ప్రజలను కోరారు. సచివాలయ సిబ్బంది పనితీరును, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించి ముఖ్యమంత్రికి మంచి పేరు తేవాలని అధికారులు, సచివాలయ ఉద్యోగులకు హితవు పలికారు. కార్యక్రమంలో బత్తిన నవీన్‌కుమార్, దొడ్డి బాపూ ఆనంద్, ధనలక్ష్మి, పల్లా శ్రీనివాస్, దండెం వెంకటేష్, నక్కా వేణుగోపాల్, బాబూరావు, లండా రమణ, ముజీబ్‌ఖాన్, రాముమాస్టారు, రాజేష్, జీతు, బొగ్గు శ్యామ్, ప్రసాద్, బోని దేవాతో పాటు జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏఈ పార్వతి, టౌన్‌ప్లానింగ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వాటర్ సప్లై ఏఈ రవికుమార్, ఎలక్ట్రికల్ ఏఈలు రవిశంకర్, అన్నంనాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

ద్రోణంరాజు కుటుంబాన్ని పరామర్శించిన రఘువీరా



ద్రోణంరాజు శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రఘువీరారెడ్డి

డాబాగార్డెన్స్: పీసీసీ మాజీ ప్రెసిడెంట్ ఎన్. రఘువీరారెడ్డి శనివారం ద్రోణంరాజు శ్రీనివాసరావు కుటుంబాన్ని, తనయుడు శ్రీవత్సన్‌ను పరామర్శించారు. శ్రీనివాసరావు మృతికి సంతాపం తెలిపారు. శ్రీనివాసరావుతో ఉన్న బంధాన్ని కుటుంబ సభ్యులతో చెప్పారు. పరామర్శ కార్యక్రమంలో గొంప గోవింద్, సత్యనారాయణ, లింగం శ్రీనివాస్, కావూరి చరణ్‌కుమార్, రామకృష్ణ, కొయ్య చిన్ని, కోట రమేష్, కొణతాల శ్రీనివాస్, సీహెచ్ వెంకటేశ్వరరావు, సూరాడ అప్పారావు, నిఖిలేష్, కర్రి రామారెడ్డి, కండిపల్లి సతీష్, గంగాధర్, పోలిపల్లి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

30న 'ఉక్కు ప్రజాగర్జన'ను విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తామని మోదీ ప్రకటించి ఈ నెల 27 నాటికి రెండేళ్లు పూర్తయింది. రెండేళ్లుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని వివిధ రూపాల్లో ఆందోళనలు, పోరాటాలు కొనసాగుతున్నాయి. మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తాం.. లేదా మూసేస్తామని ప్రకటిస్తున్న నేపథ్యంలో మోదీ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 30న మధ్యాహ్నం 3 గంటలకు ఉక్కునగరం సెక్టార్-5లో గల త్రిష్ట్రాగ్రౌండ్స్‌లో ఉక్కు ప్రజాగర్జన భారీ సభ నిర్వహించనున్నట్టు అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటూ కార్యాలయంలో ప్రజాగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలు అన్నింటినీ కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు మోదీ ప్రభుత్వం పూనుకుందన్నారు. గత రెండేళ్లుగా పెద్ద ఎత్తున పోరాటాలు, నిరసనలు, ఆందోళనలు చివరకు రాష్ట్ర బంద్ నిర్వహించినా ప్రభుత్వ నిర్ణయంలో మార్పు రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏకగ్రీవంగా స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేసినా కేంద్ర ప్రభుత్వం వైఖరిలో మార్పు రాలేదన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం. జగ్గునాయుడు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, మంత్రి రాజశేఖర్, ఎం. మన్మథరావు, వై. మస్తానప్ప, దొమ్మేటి అప్పారావు, కనకారావు, గండి నాయనబాబు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

నేడు వేటూరి చిత్రగీతాల విభావరి

డాబాగార్డెన్స్ : ప్రముఖ సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 88వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 29న వేటూరి చిత్రగీతాలతో 'ఝుమ్మంది నాదం..' శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు ఆత్రేయ స్మారక కళా పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్న సంగీత విభావరిలో ప్రముఖ గాయకులు కెజె రాజేంద్రప్రసాద్, రమేష్ పట్నాయక్, ఫణిభూషణ్, శంబర జోగారావు, పీఎల్ నాయుడు, ఎంవీఆర్ నాగేశ్వరరావు, సరాగ మాలికకుమారి, కల్యాణి, శృతి, శ్రీకృతి, శైలజ, జ్యోత్స్న, దీప్తి వేటూరి విరచిత గీతాలు ఆలపిస్తారన్నారు. సంగీత ప్రియులు హాజరు కావాలని కోరారు.

సచివాలయ సిబ్బందితో 'ముఖాముఖి'



ఏఎస్సార్ నగర్‌వాసులతో మాట్లాడుతున్న సచివాలయ సెక్రటరీ దేవి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం స్థానికులతో సచివాలయ సిబ్బంది ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. దీని ద్వారా స్థానికుల సమస్యలు సచివాలయ సిబ్బంది నేరుగా తెలుసుకుని, పరిష్కార మార్గాలు చూపించడం సులభమవుతుందని డీబీఆర్‌సీ ప్రతినిధులు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చాలా బాగుందని కాలనీవాసులు కితాబిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు గ్రేస్, దేవి, డీబీఆర్‌సీ ఫీల్డ్ కో ఆర్డినేటర్ నిఖిలా, కనపర్తి రాజు, వలంటీర్లు రాధిక, ధనలక్ష్మి, కాలనీ నాయకుడు సతీష తదితరులు పాల్గొన్నారు.

యూజర్ చార్జీలపై ప్రత్యేక డ్రైవ్



యూజర్ చార్జీలు వసూలు చేస్తున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ తదితరులు

జగదాంబ: యూజర్ చార్జీలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జీవీఎంసీ జోన్-4 అడిషనల్ మెడికల్ అధికారి ఎస్.కిశోర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు వారంలో బుధవారం, శనివారం రెండు రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నామన్నారు. ప్రజల నుంచి స్పందన బాగుందన్నారు. అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో కలెక్షన్లు బాగున్నాయన్నారు. మురికివాడల్లో కూడా సెక్రటరీలు, వార్డు ఇన్‌స్పెక్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. శనివారం ఒక్కరోజే రూ. 2 లక్షల 50 వేలకు పైగా వసూళ్లు జరిగాయన్నారు. ఈ విధంగా యూజర్ చార్జీల వసూళ్లలో జోన్-4ను మొదటి స్థానానికి తీసుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్ అర్హత పెంపుపై హర్షం

ఎంవీపీకాలనీ: గ్రూప్-1 అభ్యర్థుల అర్హత పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంపై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో గ్రూప్-1 మెయిన్స్‌కు 1:20 నిష్పత్తిలో అభ్యర్థులను ఏపీపీఎస్సీ మెయిన్‌కు ఎంపిక చేసేదన్నారు. పెద్ద ఎత్తున నిరుద్యోగులు ఉద్యోగ అవకాశం కోల్పోతున్న నేపథ్యంలో ఆ నిష్పత్తిని 1:50కి (మెయిన్స్ రాతపరీక్షలో ఒక ఉద్యోగానికి 50 మంది పోటీలో ఉండేలా) పెంచాలని చాలా కాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. ప్రిలిమినరీ ఎగ్జామ్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను 1:50 నిష్పత్తిలో మెయిన్‌కు అవకాశం కల్పిస్తూ ఏపీపీఎస్సీ నిర్ణయం ప్రకటించడంపై అభినందనలు తెలియజేశారు.

పెరుగుతున్న ఆర్థిక అసమానతలు



మాట్లాడుతున్న ఆర్థిక శాస్త్ర ఆచార్యుడు వంశీ

సీతంపేట: గత మూడు నాలుగు దశాబ్దాలుగా ఆర్థిక అసమానత, ఆర్థిక అస్థిరత, మానవ-ప్రకృతి పరస్పర చర్యలు పెరిగాయని ఆర్థిక శాస్త్ర ఆచార్యుడు వకులాభరణం వంశీ అన్నారు. మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'మార్క్స్ పెట్టుబడి గ్రంథం సమకాలీన ప్రాసంగికత' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఈ సమస్యలకు శాశ్వతమైన పరిష్కారం కోసం పెట్టుబడిదారీ వ్యతిరేక రాజకీయ ఎజెండా తప్పనిసరని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉత్పత్తి సాధనాల యజమానులు కార్మికుల అదనపు విలువలను కాజేస్తున్నారని విమర్శించారు. వ్యక్తిగత సంపద అసమానత స్థాయిల్లో చిన్నదైన కానీ గుర్తించదగిన పెరుగుదలతోపాటు వాస్తవంగా అన్ని సమూహాల్లో దేశంలో సంపదల స్థాయిలు పెరిగాయన్నారు. కార్ల్‌మార్క్స్ రాసిన గ్రంథం చదవడం ద్వారా అనేక అంశాలను అవగతం చేసుకునేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్. అంజయ్య, మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం నిర్వాహకుడు జె.వి.సత్యనారాయణమూర్తి, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు సిహెచ్.రాఘవేంద్రరావు, సీపీఐ కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన పీబీ శ్రీనివాస్ గానలహరి



ఉప్పలపాటి జానకిదేవి, ప్రకాష్ దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

అల్లిపురం: ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు పీబీ శ్రీనివాస్ స్మారకార్థం ఎంటీఆర్ సినీ సాంగ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీబీ శ్రీనివాస్ గానలహరి ఆహూతులను అలరించింది. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరిలో సంస్థ అధ్యక్షుడు ఎం.త్రినాథరావు, మహ్మద్ ఖాన్, లాయర్ శ్రీదేవి, ఎంవీఆర్ నాగేశ్వరరావు, లక్ష్మీ సాత్విక్, కందర్ప రాధ, ఎస్ఎస్ఎన్ రాజ, లక్ష్మణ్, లయ, శశికళ, నాగలక్ష్మి పాడిన గీతాలు ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ న్యాయవాది ఉప్పలపాటి జానకిదేవి, ప్రకాష్ దంపతులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో గంటి మురళి, కొణతాల రాజు, చెన్నా తిరుమలరావు, మెలోడి సత్యనారాయణ, జీఎంఆర్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి కుష్టువ్యాధిపై అవగాహన

మహారాణిపేట : జాతిపిత మహాత్మా గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా ఈనెల 30 నుంచి వచ్చేనెల 13 వరకు కుష్టువ్యాధి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా లెప్రసీ అండ్ టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పాఠశాల, కాలేజీ విద్యార్థులు పాల్గొని కుష్టువ్యాధి నివారణకు కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో ఆశ, అంగన్‌వాడీ, ఏఎన్‌ఎం, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు. చర్మంపై ఎర్రని రాగి రంగు స్పర్శ లేని మచ్చలు, శరీరం, ముఖంపై బొడిపెలు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, చేతి వేళ్లు వంగిపోవడం, కాళ్లు, పాదాలు వాలిపోవడం, కళ్లు మూత పడకపోవడం వంటివి కుష్టువ్యాధి లక్షణాలని తెలిపారు. అలాంటి లక్షణాలు కలిగిన వ్యక్తులు ఆశ లేదా ఆరోగ్య కార్యకర్తను సంప్రదించి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స పొందాలని అన్నారు. ప్రారంభ దశలోనే ఈ వ్యాధిని గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చన్నారు. అంగవైకల్యం గల వారికి ప్రభుత్వం ఉచితంగా శస్త్రచికిత్స చేయించి అదనంగా 8 వేల రూపాయల పారితోషకం అందిస్తుందని డాక్టర్ పూర్ణేంద్రబాబు తెలిపారు. కుష్టువ్యాధిగ్రస్తులు లేదా కుటుంబ సభ్యులకు ఉచితంగా సాంకేతిక విద్యలో శిక్షణ అందజేసి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.

థైరాయిడ్ వ్యాధిగ్రస్తులకు కంటి సమస్యలు

ఆరిలోవ: థైరాయిడ్‌తో బాధపడుతున్న వారికి కంటి సమస్యలు కూడా వచ్చే అవకాశముందని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యురాలు మల్లు అఖిల తెలిపారు. థైరాయిడ్ కంటి వ్యాధిపై శనివారం ఆమె వివరించారు. థైరాయిడ్ ఉన్న వారిలో ఎక్కువ మందికి కంటి కదలికలో పరిమితి, ద్వంద్వ దృష్టి, చూపు కోల్పోవడం తదితర తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందన్నారు. ఈ పరిస్థితిలో కొంతమందికి శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం ఏర్పడుతుందని చెప్పారు. ఈ సమస్య ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాంటివారు కంటి వైద్యులను సంప్రదించి తరుచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. థైరాయిడ్ కంటి వ్యాధి అనేది ఒక రుగ్మత లాంటిదన్నారు. థైరాయిడ్‌తో బాధపడుతున్న వారి శరీరంలో విడుదలైన హార్మోన్లు కంటి చూపుపై ప్రభావం చూపుతాయన్నారు. ఈ వ్యాధి ఎక్కువగా 30 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు గల మహిళల్లో వస్తుందన్నారు. దీంతోపాటు దీర్ఘకాలంగా దూమపానానికి అలవాటుపడిన వారిలో కూడా ఎక్కువగా వ్యాధి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. దీనిపై జాగ్రత్త అవసరమని డాక్టర్ అఖిల సూచించారు.

దేశానికి సేవ చేయండి



మాట్లాడుతున్న రిటైర్డ్ వైస్ అడ్మిరల్ రమన్ పూరి



చైతన్య సదస్సులో పాల్గొన్న పాలిటెక్నిక్ విద్యార్థులు

మురళీనగర్: దేశం కోసం మనం ఏమి చేయగలమని విద్యార్థులు ఆలోచించాలని రిటైర్డ్ వైస్ అడ్మిరల్ రమన్ పూరి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ జీవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు నిర్వహించిన చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే దేశంపై ప్రేమ, త్యాగం అనే ముఖ్యమైన గుణాలను అలవరచుకోవాలని సూచించారు. ప్రపంచంలోనే భారతీయులు అత్యంత మేధోశక్తి గల వారన్నారు. ఎవరి శక్తిపై వారికి సంపూర్ణమైన నమ్మకం కలిగి ఉన్నప్పుడు అనుకున్నది సాధించగలరని చెప్పారు. విద్యార్థులు మంచి విలువలు, ఉన్నత వ్యక్తిత్వం కలిగిన పౌరులుగా తయారు కావాలని, అందుకు అధ్యాపకులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మనిర్భర్ భారత్‌లో పాల్గొని దేశానికి సేవ చేయాలని రమన్ పూరి పిలుపునిచ్చారు. ఇన్నోవేషన్ క్లబ్‌ల ఏర్పాటు ద్వారా పరిశోధనలపై విద్యార్థులకు ఆసక్తి కలిగేలా చూడాలన్నారు. తెలివైన, మేధావులైన విద్యార్థులు ఇతర దేశాలకు వలస వెళ్లడం వల్ల దేశానికి నష్టం కలుగుతుందని వివరించారు. స్వదేశీ సాంకేతిక అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు విశిష్టమైనవని పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్తమ జీవనానికి నిర్ణయాలు తీసుకోవడంలో చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో 800 మంది విద్యార్థులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి ఆశ్రమంలో సేవా కార్యక్రమాలు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 19వ వార్డు శాంతి ఆశ్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఏయూ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఏయూ మాజీ వీసీ ఆచార్య రొక్కం రాధాకృష్ణ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని విద్యార్థుల కోసం 60 ప్లాస్టిక్ కుర్చీలను వితరణ చేశారు. విద్యార్థులకు పలు ఆటలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, మధ్యాహ్న భోజనం అందించారు. విద్యార్థులతోను, యాజమాన్యంతోను మమేకమై వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు.

వైభవ వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.